క్లుప్తంగా

నీటి సమస్య పరిష్కారం



రిపేరీ చేయడంతో బోరు బావి నుంచి నీళ్లు వస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

సోమందేపల్లి: మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలోని బీసీ కాలనీలో నీటి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. ఖాళీ బిందెలతో నిరసన అన్న శీర్షిక 'సాక్షి'లో సోమవారం కథనం ప్రచురితం కావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, సర్పంచు పరంధామ స్పందించారు. మంగళవారం తాగునీటి బోరు వద్ద మరమ్మతు పూర్తి చేశారు. దీంతో కాలనీకి యథావిధిగా నీటి సరఫరా జరగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు మండల పూజ



అలంకరణలో కెంచమాంబదేవి

అమరాపురం: మండల పరిధిలోని ఉదుగూరులో వెలసిన కుంచిటి వక్కలిగుల సోమేనహళ్లి జానకల్లు గోత్రానికి చెందిన కుల దైవం కెంచమాంబదేవి మండల పూజ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగానే మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

వృత్తివిద్య - వ్యక్తిత్వ వికాస శిబిరం

హిందూపురం: మండలంలోని గోళాపురం పంచాయతీలోని సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృత్తి విద్య వక్తిత్వ వికాసం శిక్షణ తరగతుల శిబిరాన్ని ప్రారంభించారు. చేతివృత్తులపై శిక్షకులకు 7 రోజులు పాటు గ్రామంలోని శివాలయం వద్ద శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం వారు పలువురికి ఉపాధి వృత్తి విద్యపై శిక్షణ ఇస్తారన్నారు. సర్పంచు దేవరాజు, సూర్యఫౌండేషన్ జోన్ ఇన్‌చార్జ్ శత్రుఘన్, శివాలయం చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చింత వనానికి నిప్పు



కాలిపోతున్న చింత చెట్లు

అగళి: మండల కేంద్రంలోని చింతవనానికి మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో దాదాపు 30 చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. అగళి పంచాయతీ చెందిన రైతు సరోజమ్మ, నరసింహమూర్తి ఎంఎం పాళ్యం వద్ద 2.5 ఎకరాల్లో ఎనిమిదేళ్ల క్రితం చింత సాగు చేశారు. మంగళవారం సాయంత్రం ఆ పొలానికి సమీపంలో ఉన్న భూమిలో ఎండుగడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పురాజేశారు. దీంతో మంటలు చెలరేగి 30 చింత కాలిపోయాయి. దీంతో లక్ష పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు.

'గురుకుల' దరఖాస్తు గడువు పొడిగింపు

మడకశిరరూరల్: జిల్లాలోని మహాత్మాజ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల, ఐదో తరగతి, బ్యాక్‌లాగ్ దరఖాస్తు గడువును ఈనెల 25 వరకూ పొడిగించినట్లు జిల్లా గురుకుల పాఠశాల కన్వీనర్ రమాదేవి తెలిపారు. విద్యార్థులు గడువు లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్ ప్రవేశ పరీక్ష మే 4వ తేదీ ఉంటుందన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



అల్లాబకాష్‌తో జిమ్ సభ్యులు

హిందూపురం టౌన్: పట్టణంలోని నింకంపల్లికి చెందిన అల్లాబకాష్ సూళ్లూరుపేటలో సోమవారం జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో 4వ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచాడు. ఇందులో భాగంగా మంగళవారం పట్టణంలోని వైల్డ్ ఫిట్‌నెస్ జిమ్‌లో అల్లాబకాష్‌ను సన్మానించారు. 43 ఏళ్ల వయసులో అల్లాబకాష్ మిస్టర్ ఆంధ్ర పోటీల్లో పాల్గొని యువకులకు ఆదర్శంగా నిలిచారని జిమ్ కోచ్ అరాఫత్ తెలిపారు.

'పెనుకొండ జంక్షన్' పేరుకు మాత్రమే అన్న రీతిలో మారింది. కియా కార్ల పరిశ్రమ రాకతో ఈ ప్రాంత రూపురేఖలు మారినా రైల్వేస్టేషన్‌లో సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ముఖ్యంగా ఇక్కడి నుంచి వెళ్లే ప్రధాన రైళ్లు ఇక్కడ ఆపకపోవడంతో ఉద్యోగులు, వేలాది మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధర్మవరం, పుట్టపర్తి, అనంతపురం ప్రాంతాలకు పరుగు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది.



పెనుకొండ రైల్వేస్టేషన్



కుర్లా ఎక్స్‌ప్రెస్

పేరుకే జంక్షన్.. సమస్యలతో టెన్షన్

- పెనుకొండ రైల్వేస్టేషన్‌లో ఆగని ప్రధాన రైళ్లు
- 'కియా' రాకతో పెరిగిన ఉద్యోగులు, కార్మికుల రాకపోకలు
- ట్రైన్లు నిలపకపోవడంతో ఇతర ప్రాంతాలకు పరుగు
- సమస్యలు తిష్ట వేయడంతో ప్రయాణికుల అవస్థలు

పెనుకొండ రూరల్: జిల్లాలోనే పెనుకొండ ప్రాంతం అత్యంత కీలకంగా మారింది. ముఖ్యంగా కియా పరిశ్రమ రాకతో ఈ ప్రాంత అభివృద్ధి వేగం పుంజుకుంది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు ఇక్కడున్న కియాతో పాటు దాని అనుబంధ పరిశ్రమలో పనిచేస్తుంటారు. అలాగే మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వంటి ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ ఉపాధి పొందుతున్నారు.

ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు

పెనుకొండ రైల్వేస్టేషన్ నుంచి రోజూ 11 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇందులో ఆరు రైళ్లు రైల్వేస్టేషన్‌లో ఆపడం లేదు. కుర్లా, బసవ, సోలాపూర్, రాజధాని, బీదర్, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉద్యోగులకు ఇబ్బందులు

కొన్ని వందల కిలో మీటర్లు ప్రయాణించి పెనుకొండ మీదుగా వెళ్తున్న రైళ్లలలో ఇక్కడి స్థానికులు ప్రయాణం చేయలేకపోతున్నారు. కళ్ల ముందరే రైలు వెళ్తున్నా ఇతర ఊళ్లకు తమ గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కియా ప్రభావంతో పెనుకొండలో జనాభా పెరగడంతో నిత్యం రహదారులతో పాటు , బస్టాండ్లు, రైల్వేస్టేషన్ ప్రయాణికుల రద్దీ కూడా పెరిగింది. హౌరా, కోయంబత్తూరు వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లు పెనుకొండ జంక్షన్‌లో ఆపడం లేదు. ఇది మాత్రమే కాకుండా పెనుకొండ కేంద్రంగా రోజూ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, అనంతపురం, హిందూపురం, ధర్మవరం వంటి పట్టణాల నుంచి రైలులో ప్రయాణిస్తుంటారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు రైళ్లు నడుస్తున్నా ఆపకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

అర్జీలు ఇచ్చినా ఫలితం సున్నా...

పెనుకొండ పట్టణంలోని రైల్వేస్టేషన్లలో ప్రధాన రైళ్లను ఆపాలని ఇక్కడి ప్రజా సంఘాల నేతలు, ప్రజలు రాజకీయ నాయకులు, రైల్వే అధికారులకు ఎన్నోసార్లు అర్జీలు ఇచ్చారు. ఇచ్చినప్పుడు మాత్రం చేస్తాం.. చూస్తాం అంటారని ఆ తర్వాత అర్జీలను పక్కన పడేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

స్టేషన్‌లో తిష్టవేసిన సమస్యలు

పెనుకొండ రైల్వేస్టేషన్ భవనం ఏళ్ల నాటిది. వందల సంఖ్యలో ప్రయాణికులు రాక పోకలు సాగించే స్టేషన్‌లో అరకొర షెడ్డులను మాత్రమే ఏర్పాటు చేశారు. ముఖ్యంగా విశ్రాంతి గది, కోచ్ డిస్ ప్లే, మరుదొడ్ల శుభ్రత వంటి సమస్యలు ఇక్కడ నెలకొన్నాయి. దీనికి తోడు అరకొర ఫ్యాన్లు ఉండటంతో రాత్రి సమయాల్లో ఇక్కడ నిలబడాలన్నా దోమలు చుక్కలు చూపుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



కియా పరిశ్రమ రాకతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా మారింది. వేలాది మంది వలస కార్మికులు కూడా ఇక్కడ పనిచేస్తున్నారు. గుంటూరు, విజయవాడ లాంటి ప్రాంతాలకు తరచూ పెనుకొండ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ముఖ్యమైన రైళ్లను ఈ స్టేషన్‌లో ఆపకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని రైళ్లను ఆపడంతో పాటు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి. పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ఫ్యాన్లు, ఏసీలు, శుద్ధమైన తాగునీటిని ఏర్పాటు చేయాలి.

– షమీవుల్లా, పెనుకొండ

అర్జీలను పట్టించుకోలేదు



పెనుకొండ ప్రయాణికుల సౌకర్యార్థం కుర్లా, బసవ, హౌరా రైళ్లను ఆపేందుకు రైల్వే అధికారులు చొరవ చూపాలి. ఎన్నోమార్లు కేంద్ర ఉన్నతస్థాయి అధికారులు, రాజకీయ ప్రముఖులకు అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంత ప్రజలతో పాటు కియా ఉద్యోగులు కూడా వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. అయితే ముఖ్యమైన రైళ్లను ఆపకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్టేషన్‌లో కూడా అధునాతన సౌకర్యాలు కల్పించాలి.

– ఎంఎస్ మూర్తి, పెనుకొండ

కూటమి ప్రభుత్వానికి పాలించే అర్హత లేదు



పార్టీ శ్రేణులతో కలిసి కాఫీ తాగుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పరిగి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఏఒక్క సంక్షేమ పథకం మాదరికి చేరలేదని శీగిపల్లి వాసులు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని శీగిపల్లిలో మంగళవారం ఉషశ్రీచరణ్ నేతృత్వంలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ గడప గడపకూ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల హయాంలో చేతకాని హామీలతో గద్దెనెక్కిన కూటమి సర్కార్‌కు రాష్ట్ర ప్రజలను చిన్నచూపు చూస్తోందన్నారు. 9 నెలల కాలంలో ఏమాత్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయని కూటమి ప్రభుత్వానికి పాలించే అర్హతే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ లక్ష్మణ్ణ, మండల నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

యువతి అదృశ్యం

గోరంట్ల: సోమందేపల్లి మండల పరిధిలోని వెలగమాకులపల్లికి చెందిన అర్చన (23) అదృశ్యమైనట్లు సీఐ బోయ శేఖర్ తెలిపారు. ఆమె తండ్రి లక్ష్మీనరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆయన తెలిపిన వివరాలమేరకు.. వెలగమాకులపల్లికి చెందిన అర్చన పాలసముద్రం సమీపంలోని కియా అనుబంధ కంపెనీలో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం పనికని వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదన్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



అలంకరణలో ఒడ్నమ్మదేవి

అగళి: మండల పరిధిలోని నరసంబుది గ్రామం పొలిమేరలో వెలసిన ఒడ్నమ్మదేవి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి జ్యోతులు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

శక్తి దేవతల దర్శనం కోసం స్వామిజీ పాదయాత్ర

మడకశిర: దేశంలోని శక్తిదేవతల దర్శనం కోసం మధ్యప్రదేశ్‌కు చెందిన నర్మదానందస్వామి చేపట్టిన పాదయాత్ర మడకశిరకు చేరుకుంది. సోమవారం రాత్రి విశ్వహిందూ పరిషత్, పలు హిందూ సంఘాలు నర్మదానందస్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తర్వాత పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో స్వామిజీ బస చేశారు.

ఉపాధి పనుల పరిశీలన

రొద్దం: మండల పరిధిలోని కలిపి పంచాయతీ పరిధిలోని శేషాపురం వద్ద జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. కూలీల సమస్యలు, ఉపాధి పథకం అమలు తీరును కూలీలతో అడిగి తెలుసుకున్నారు. పది వారాల గడిచినా ఇంతవరకూ కూలీల బిల్లులు రాలేదని వాపోయారు. ఉగాది, శ్రీరామనవమి పండుగలు దగ్గర పడుతున్నా తమకు బిల్లులు రాకపోతే పండుగ వేళ పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా పోరాదామని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా గ్రామసభ

పావగడ: తాలూకాలోని బూదిబెట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎత్తినహళ్లిలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభ సజావుగా జరిగింది. పీడీఓ ముద్దురాజు మాట్లాడుతూ ప్రజల నుంచి 146 అర్జీలు వచ్చాయన్నారు.

వలంటీర్లను నమ్మించి వంచించారు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



చిలమత్తూరు: రూ.10 వేల జీతం ఇస్తామంటూ వలంటీర్లను నమ్మించి మోసం చేసిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. మంగళవారం ఆమె పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజలనే కాదు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులనూ చంద్రబాబు మోసం చేశారన్నారు. ఇలాంటి వ్యక్తి దేశంలోనే కాదు ప్రపంచంలోనూ ఎక్కడా ఉండదన్నారు. వలంటీర్లను ఉన్నఫలంగా తొలగిస్తే వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కక్ష తీర్చుకుంటున్నారని, అది చాలదన్నట్టు వలంటీర్లపైనా కక్ష తీర్చుకోవడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా వలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించి వారికి మాట ఇచ్చినట్లు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో సంకీర్తనలు



అలంకరణలో లక్ష్మీదేవి సమేత నరసింహస్వామి

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయ ఆవరణలో దేవత సంకీర్తనల కార్యక్రమాన్ని నిర్వహించారు. వేకువజామున లక్ష్మీదేవి అమ్మవారి సమేత నరసింహస్వామి మూల విగ్రహానికి అభిషేకించారు. అనంతరం వెండి కవచాలు, బంగారు ఆభరణాలు, భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టువస్త్రాలు, వడిబియ్యం, పూలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి మహామంగళ హారతి ఇచ్చారు. ఆలయ ఆవరణలో వేదపండితుల ఆధ్వర్యంలో దేవతా సంకీర్తనలు, హరికథలు, భజనలు భక్తులను అలరించాయి.

నేడు భూతప్పల ఉత్సవం..

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ భూతప్పస్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భూతప్ప ఉత్సవాల్లో పాల్గొనేందు వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు మంగళవారం సాయంత్రమే ఆలయం వద్దకు చేరుకున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా కమిటీ వారు ఏర్పాట్లు చేశారు.

ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



నియామక పత్రాలు అందజేసిన దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగ విజయోత్సవం, వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. 13 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కావడంతో మడకశిర మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేసినా, అమ్మినా పీడీ యాక్ట్

- జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్



పెనుకొండ రూరల్: గ్రామాల్లో నాటుసారా అమ్మినా, తయారు చేసినా పీడీ యాక్టులు నమోదు చేస్తామని ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి గోవిందనాయక్ తెలిపారు. మంగళవారం మండంలోని శెట్టిపల్లి తండాలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా నిర్మూలనపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటుసారా వల్ల కలిగే దుష్ఫలితాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అక్రమంగా మద్యం, నాటు సారాను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని గోవిందనాయక్ హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ సృజన్ బాబు, ఎస్‌లు రాముడు, రాజశేఖర్, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	37.0
పెనుకొండ	39.0
మడకశిర	37.0

వాటర్ ఫిల్టర్ అందజేత

లేపాక్షి: మండల పరిధిలోని శిరివరంలోని జామియా మసీదుకు సర్పంచ్ నేత్రావతి వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మైనార్టీలకు వాటర్ ఫిల్టర్‌ను ఇచ్చారు.

పదో తరగతి సిబ్బంది పారితోషికం పెంచండి

మడకశిరరూరల్/పెనుకొండ: పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఉన్న సిబ్బంది పారితోషికం పెంచాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంపీ కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మారుతీప్రసాద్, జయకృష్ణ, నరేష్, మక్కిశెట్టి కుమార్ తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. నవోదయ, గురుకుల ప్రవేశ పరీక్షల రెమ్యూనరేషన్ రెండు వందల వరకు ఇస్తున్నారని, పదో తరగతి పరీక్ష విధులకు మాత్రం తక్కువ మొత్తం చెల్లిస్తున్నారన్నారు.

'అధికారుల అండతోనే మట్టి దందా'

సోమందేపల్లి: మండల అధికారులు అండతోనే కూటమి నాయకులు అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామి ఆరోపించారు. మంగళవారం కొత్తపల్లి చెరువులో సర్పంచ్ నరసింహులు అక్రమంగా తన జేసీబీ ద్వారా మట్టి తరలిస్తుండగా అడ్డుకున్నట్లు చెప్పారు. ఇరిగేషన్ రెవెన్యూ , అధికారులు కుమ్మక్కు కావడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించండి

గోరంట్ల: రోగులకు నాణ్యమైన వైద్యసేవలను అందించడంతో పాటు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్యసిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ప్రమీల పేర్కొన్నారు. మంగళవారం ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన మండల పరిధిలోని కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రకుమార్ మెడికల్ ఆఫీసర్ మాధవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.2 లక్షల అవినీతి



ప్రజా వేదికలో మాట్లాడుతున్న ప్రొసీడింగ్ అధికారి శివశంకర్


గుడిబండ: జాతీయ ఉపాధి హామీ పథకం 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో నిర్వహించారు. మండల వ్యాప్తంగా 2023-24 సంవత్సరంలో నిర్వహించిన పనుల్లో రూ.7 కోట్ల పనుల్లో వివిధ రకాలుగా రూ.2 లక్షలు అవినీతి జరిగినట్లు సామాజిక బృందం గుర్తించింది. వెంటనే ఆ డబ్బును రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాధార్, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బస్సు


హిందూపురం: హిందూపురం మండలంలోని తూమకుంట చెక్‌పోస్టు సమీపంలో ప్రైవేటు బస్సు ఆటోను ఢీ కొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది మహిళలకు గాయలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.అయితే వారిలో ఒకరు గౌరిబిదనూర్‌కు చెందిన మమత పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ఆమెను బెంగళూరు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వీఎస్ఎస్ఎన్ అధ్యక్షుడిగా మధుశ్

పావగడ: తాలూకాలోని కేటి హళ్లిలోని వీఎస్ఎస్ఎన్ అధ్యక్షుడిగా కూటమి అభ్యర్థి దేవలకెరె మధుశ్ ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో 216 ఓట్ల అత్యధిక మెజారిటీతో ఆయన గెలుపొందారు. మధుశ్‌ను స్థానిక బీజేపీ, జేడీఎస్ నాయకులు అభినందించారు.



హంద్రీనీవా కాలువలో ఈత కొడుతున్న దృశ్యం



కాలువలోకి దూకుతున్న యువకుడు

ఈత కొడుతూ.. సేద తీరుతూ..

ఎండలు దంచికొడుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉపశమనం కోసం స్థానికంగా ఉన్న బావులు, చెరువు, కాలువల్లో సేదతీరుతున్నారు. సోమందేపల్లిలోని హంద్రీనీవా కాలువ వద్ద చిన్న, పెద్దా తేడా లేకుండా అందరూ ఈత కొట్టేందుకు వస్తున్నారు.

– సోమందేపల్లి: